క్లుప్తంగా

నేడు సిరుల ఎల్లమ్మ జాతర

కురుపాం: మండల కేంద్రంలో సిరుల ఎల్లమ్మ జాతర మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. స్థానిక గొడు వీధి సమీపంలోని అమ్మవారి ఆలయంలో తెల్లవారుజాము నుంచే పూజలు ప్రారంభంకానున్నాయన్నారు. పట్టణ వాసులతో పాటు పరిసర గ్రామాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు రానున్నందున వారికి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. వేసవి నేపథ్యంలో టెంట్లు, తాగునీరు వంటి వసతులు కల్పించామన్నారు.

మండల సమావేశం రేపు

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.సూర్యనారాయణ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. మండల అధ్యక్షుడు ఉరిటి రామారావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి పూర్తి సమాచారంతో అధికారులు హాజరు కావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కూడా ఈ సమావేశానికి హాజరవుతారన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



సీఎం జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

భామిని: పాలకొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా విశ్వాసరాయి కళావతిని ఎంపిక చేయడంపై ముఖ్యమంత్రి జగనన్నకు పార్టీ మండల నాయకులు సోమవారం కృతజ్ఞతలు తెలియజేశారు. భామినిలో పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, బత్తిలి ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులంతా సమావేశమై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పాలకొండ నుంచి ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా కళావతమ్మను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు ఆమెపై ఉన్న విశ్వాసమే ఆమె గెలుపునకు సోపానమన్నారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, పార్టీ నాయకులు బొడ్డేపల్లి ప్రసాద్, మేడిబోయిన చలపతి, సర్పంచ్‌లు జామి ప్రభాకర్, మడపాన కేశవ, కొత్తూరు ప్రసాద్, గిరిజన సంఘ నాయకులు పిరపక శ్రీను, కొండగొర్రి చంటి, ఆరిక జమ్మయ్య, పత్తిక సింహాచలం, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

భామిని: మండలంలో బిల్లుమడకు చెందిన సీనియర్ నాయకుడు సిగడాన గజపతినాయుడు(90) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. మండల వైస్ ఎంపీపీ భోనగడ్డి ధర్మారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం బిల్లుమడ వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సంతాపం తెలియజేశారు. గజపతినాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బిల్లుమడ, బురుజోల, నులకజోడు సర్పంచ్‌లు సిగడాన రాధాకృష్ణ, మడపాన కేశవ, కొత్తూరు ప్రసాద్, ఎంపీటీసీ బూస బాలకృష్ణ, మాజీ సర్పంచ్ సిగడాన రాజు, పార్టీ నాయకులు కాగితాపల్లి కృష్ణారావు, బొడ్డేపల్లి ప్రసాద్, తదితరులు ఉన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

వీరఘట్టం: డ్రైవింగ్ లైసెన్సు లేనివారికి, మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని ఎస్సై ఫకృద్దీన్ హెచ్చరించారు. వీరఘట్టంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. పది మంది మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడటంతో వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఇంకోసారి లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.



వీరఘట్టం: బాలికోన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



కురుపాం: పరీక్ష కేంద్ర వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు



కురుపాం జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో రూమ్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



గరుగుబిల్లి గురుకుల పాఠశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం



సీతంపేట: బాలుర గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ఆరంభమయ్యాయి. మండల కేంద్రాల్లోని పరీక్ష కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. స్క్వాడ్‌లు సైతం ఎప్పటికప్పుడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి, మాస్ కాపీయింగ్ జరగకుండా చూశారు. కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేస్తూ గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. అనివార్య కారణాల వల్ల తొలిరోజు పరీక్షలకు కొంతమంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. –పాలకొండ, కురుపాం సాక్షి నెట్‌వర్క్.



వీరఘట్టం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నిబంధనలపై అవగాహన అవసరం



మీసాల చంద్రమౌళి, సీఐ పాలకొండ

పాలకొండ రూరల్: ఎన్నికల నిబంధనల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సీఐ మీసాల చంద్రమౌళి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా సోషల్ మీడియా, వాట్సప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో ఎన్నికల నేపథ్యంలో చేసే పోస్టుల విషయంతో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. సోషల్ మీడియా గ్రూపుల్లో వచ్చే పోస్టులకు గ్రూప్ అడ్మిన్లు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. గ్రూపులో ఉండే ప్రతీ సభ్యుడు అడ్మిన్‌కు పరిచయస్తుడై ఉండాలన్నారు. అభ్యంతరకర, వదంతులు, తప్పుడు వార్తలకు సంబంధించిన సమాచారం పోలీసులకు తెలియజేయాలని, సభ్యులు ఈ తరహా చర్యలకు పాల్పడితే తక్షణమే వారిని గ్రూపు నుంచి తొలగించాలని సూచించారు. ఈ విషయంలో అడ్మిన్ స్పందించకుంటే అతనిపై పోలీసులు చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. నేరుగా అడ్మినే వివాదస్పద పోస్టులు చేస్తే ఐటీ సెక్షన్ 153ఏ ప్రకార 3–5 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంద్నారు. మార్ఫింగ్ చేసిన ఫోటోలు, విద్వేషాలు రెచ్చగొట్టే, తప్పుడు సందేశాలు ఇవ్వరాదన్నారు.

పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం



మాట్లాడుతున్న ఆంగ్ల ఉపన్యాసకురాలు శాంతి

పాలకొండ రూరల్: పుస్తక పఠనంతో నైపుణ్యాభివృద్ధి, విషయ పరిజ్ఞానం పెరుగుతుందని నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల ఉపన్యాసకురాలు ఎం.శాంతి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ప్రత్యేక సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, ఐక్యూ కోఆర్డినేటర్ బి.రాజు, ఆంగ్ల ఉపన్యాసకులు ఎస్.శంకర్‌బాబు, అధ్యాపకులు కుమారి, ప్రశాంతి, రాఘవేంద్రనాయుడు, శ్రీనివాసరావు తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో టెన్త్ విద్యార్థి మృతి



పాలక కల్యాణ్ (ఫైల్)

కొత్తూరు : మండలంలోని మహసింగి గ్రామం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలక కల్యాణ్(15) అనే పదో తరగతి విద్యార్థి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సీతంపేట మండలం కడగండి చెందిన కల్యాణ్ అదే గ్రామానికి చెందిన వి.మణికంఠ, భామిని మండలం లోహరిజోలకు చెందిన వంశీ ముగ్గురూ కలిసి ద్విచక్ర వాహనంపై సీతంపేట నుంచి కొత్తూరు వస్తుండగా.. మహసింగి సమీపంలో వీరి బండిని లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో కల్యాణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ఇద్దరినీ రాగోలు జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎంఏ అహ్మద్ తెలిపారు. ప్రమాదానికి గురైన వారు స్థానిక ఏకలవ్య పాఠశాలలో పదో తరగతి చదివారు. సీబీఎస్‌సీ కావడంతో టెన్త్ పరీక్షలు ముగించుకుని హాస్టల్ నుంచి రిలీవ్ అయిపోయారు. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

బొబ్బిలి కోట సందర్శన



బొబ్బిలి యుద్ధ స్థూపం వద్ద గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: హిస్టారికల్ టూర్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బొబ్బిలి కోటను సోమవారం సందర్శించారు. ప్రిన్సిపాల్ టి.శ్రీవరం ఆదేశాల మేరకు హిస్టరీ అధ్యాపకులు కుమారి, శ్రీవాణి, ఎకనామిక్స్ అధ్యాపకురాలు స్వరూపరాణి, ఎన్ఎస్ఎస్ పీవో బి.త్రినాథల పర్యవేక్షణలో విద్యార్థులు కోట పరిసరాలు, కోటలో ఉండే మ్యూజియం, బొబ్బిలి యుద్ధానికి ప్రతీకగా నిలిచిన స్థూపం చూసి, వాటి చరిత్రను అడిగి తెలుసుకున్నారు. మనకు దగ్గరలో చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచే కట్టడాలను విద్యార్థులకు తప్పనిసరిగా చూపించాలని అధ్యాపకులు అన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వండి

కురుపాం: ఎన్నికల విధుల నుంచి 58 ఏళ్ల వయసు దాటిన ప్రభుత్వ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని ఏపీ ఎస్సీ, ఎస్టీ యూఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోమటపల్లి త్రినాథరావు ప్రభుత్వాన్ని కోరారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వృద్ధాప్యం, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న ఉద్యోగులకు ఎన్నికల విధులు అప్పగించవద్దన్నారు. మానవతా దృక్పథంతో ప్రభుత్వం స్పందించి, త్వరగా నిర్ణయం ప్రకటించాలన్నారు.

త్రైత సిద్ధాంతంపై ప్రచారం

భామిని: మండలంలోని పెద్దదిమిలి, కాట్రగడ, కోసలి గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రచారం నిర్వహించారు. ఫాల్గుణ పూర్ణిమ ప్రాముఖ్యత, హోళీ పండుగ విశిష్టత, రంగుల ప్రాధాన్యతను వివరించారు. ఇంటింటికీ వెళ్లి త్రైత సిద్ధాంతంలోని అంశాలను ప్రచారం చేశారు. ప్రబోధ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బ్రూసిల్లిస్‌పై అప్రమత్తం

పాలకొండ రూరల్: బ్రూసిల్లిస్ వ్యాధిపై పాడిరైతులు అవగాహన పెంచుకోవాలని పశుసంవర్ధకశాఖ అధికారి సిద్ధార్థ అన్నారు. బ్రూసిల్లిస్ వ్యాధి లక్షణాలు, నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం పాడిరైతులకు అవగాహన కల్పించారు. 4–8 నెలల మధ్య వయసున్న దూడలకు టీకాలు వేయించటం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ముఖ్యంగా గర్భకోశం రోగాలు అధిగమించవచ్చన్నారు. ఈ వ్యాధి గాలి ద్వారా గర్భంలో ప్రవేశిస్తుందని తెలిపారు. పాడిరైతులు దీనిని గమనించి టీకాలు పశువులకు క్రమం తప్పకుండా వేయించాలని సూచించారు.

నేటి నుంచి సరిహద్దు మాత ఉత్సవాలు



పూజలందుకుంటున్న సంతోషిమాత

భామిని: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు మాతగా పేరుగాంచిన బత్తిలి సంతోషిమాత ఆలయ 38వ వార్షికోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల నిర్వహణకు ఆలయ కమిటీ చైర్మన్ భానుప్రసాద్ శర్మ, వైస్ చైర్మన్ రాగోలు అశోక్ నేతృత్వంలో కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ నెల 19 నుంచి 23 వరకు ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయ ప్రధాన అర్చకులు రంపా తాతబాబు శర్మ ఆధ్వర్యంలో పురోహితుల బృందం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రతీ రోజు ఉత్కళ–తెలుగు సంస్కృతుల సమ్మేళన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పక్కాగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు



కురుపాంలో ఎన్నికల కోడ్ అమలును పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమణ



గరుగుబిల్లి: నాగూరులో పర్యటిస్తున్న తహసీల్దార్ జయ, ఎంపీడీవో సూర్యనారాయణ



గరుగుబిల్లి: ఉల్లిబద్ర గ్రామంలో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసిన దృశ్యం



సీతంపేట: మండ సచివాలయం పరిధిలో కోడ్ అమలు పరిశీలిస్తున్న ఆర్వో కల్పనాకుమారి



వీరఘట్టం: మాట్లాడుతున్న తహసీల్దార్ జయప్రకాష్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

గరుగుబిల్లి: ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని తహసీల్దార్ కె.జయ, ఎంపీడీవో పి.సూర్యనారాయణ ఆదేశించారు. మండలంలోని నాగూరు గ్రామంలో సోమవారం పర్యటించిన వారు ఎన్నికల కోడ్ అమలును పరిశీలించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ అమలు నేపథ్యంలో ఎక్కడా రాజకీయ పార్టీలకు చెందిన ప్రచార పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లు ఉండకూడదన్నారు. ఎక్కడైనా ఉంటే వాటిని తీసేయాలన్నారు. అలాగే రాజకీయ నాయకుల ఫొటోలు, విగ్రహాలకు ముసుగు వేయాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఉల్లిబద్రలో పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు పర్యవేక్షణలో గ్రామంలోని బ్యానర్లు తొలగించడంతో పాటు కుడి ప్రధానకాలువ సమీపంలోని విగ్రహాలకు ముసుగులు వేశారు.

కురుపాం: ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.వి.రమణ అధికారులకు సూచించారు. స్థానిక ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఏవైనా రాజకీయ బ్యానర్లు, ఫ్లెక్సీలు ఉన్నవీ లేనివీ ఆయన సోమవారం పరిశీలించారు. ఎక్కడైనా రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రచార పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లు కనిపిస్తే వాటిని వెంటనే తొలగించాలని అధికారులకు తెలిపారు. రాజకీయ నేతల విగ్రహాలకు కూడా ముసుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో అప్పారావు, ఆర్ఐ కరుణాకర్, వీఆర్వో మహేంద్ర పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు

సీతంపేట: ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి అన్నారు. మండలంలోని జక్కరవలస, మండ గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించారు. ఎక్కడైనా రాజకీయ నాయకుల పోస్టర్లు ఉంటే వాటిని వెంటనే తొలగించాలని, విగ్రహాలకు ముసుగు వేయాలన్నారు. రాజకీయ నాయకుల పేర్లతో ఉన్న శిలాఫలకాలను కూడా మూసివేయాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ గీతాంజలి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

– వీరఘట్టం: ఎన్నికల నియమావళిపై వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జయప్రకాష్, ఎంపీడీఓ ఎంవీ సుబ్రహ్మణ్యం సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పోలీసులు, రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిబంధనలను వివరించారు. పబ్లిక్ ప్రదేశాల్లో ఉండే రాజకీయపార్టీ నాయకుల ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాలని సూచించారు. రాజకీయ పార్టీలు అనుమతి లేకుండా సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తే కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు.

పాలకొండ: ఎన్నికల ప్రవర్తన నియమావళిపై పూర్తి అవగాహనతో ఉండాలని నగరపంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. పట్టణంలోని పలు సచివాలయాలను సోమవారం ఆయన పరిశీలించారు. సచివాలయ సిబ్బందికి ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పించారు. రాజకీయ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు తొలగించాలని సూచించారు.

మంచికి మారుపేరు కళావతి



పాలకొండరూరల్: ఉద్యోగిగా, పాలనాదక్షురాలిగా పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి ప్రజల్లో మంచి గుర్తింపు ఉంది. సౌమ్యురాలు. ఎవరు కష్టాల్లో ఉన్నా ఆదుకోవడంలో ముందుంటారు. తోడు, అండగా నిలిచేవారు భౌతికంగా దూరమైన సమయంలో కన్నీరుకార్చిన సందర్భాలు కోకొల్లలు. ఆమె మంచి తనమే విజయానికి ప్రధాన బలం. ఈ సారి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని పాలకొండ నియోజకవర్గంలో ఊరూరా ప్రచారాన్ని ప్రారంభించారు. గిరిజన గూడల్లో స్పష్టంగా కనిపిస్తున్న 'నవరత్న' వికాసం ఆమెకు అఖండ విజయాన్ని అందిస్తుందని రాజకీయవిశ్లేషకులు చర్చించుకుంటున్నారు. అందరి మనసు తెలిసిన కళావతికే విజయాన్ని అందిద్దామన్న చర్చ రచ్చబండలపై జోరందుకుంది.

పేరు: విశ్వాసరాయి కళావతి
తండ్రిపేరు : కీ.శే.విశ్వాసరాయి నర్సింహదొర (వండువ దొర)
తల్లిపేరు : కీ.శే.విశ్వాసరాయి శాంతికుమారి (గృహిణి)
పుట్టిన ఊరు : వండువ గ్రామం, వీరఘట్టం మండలం
పుట్టిన తేదీ : 05–07–1965
విద్యార్హతలు : ఎంఏ సోషియాలజీ (ఆంధ్రాయూనివర్సిటీ)
ఉద్యోగ అనుభవం : మాజీ డిప్యూటీ మేనేజర్, ఎస్‌బీఐ
భర్త పేరు: మండంగి హరిప్రసాద్ (డిప్యూటీ రిజిస్ట్రార్, కో ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్)
పిల్లలు : సాయివైష్ణవి (20 సంవత్సరాలు)
అభిరుచులు : సామాజిక సేవ, గ్రామీణ ప్రాంత స్థితిగతులు, జీవన విధానం, రాజకీయ స్థితిగతులపై లోతైన విశ్లేషణ చేయడం, కూరగాయల పెంపకం.
ఇష్టమైన ప్రదేశాలు : గ్రామీణ ప్రాంతాలు
క్రీడలు : బ్యాడ్మింటన్‌పై ఆసక్తి
చేపట్టిన పదవులు : 2014 నుంచి పాలకొండ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.
నామినేటెడ్ పదవి : ఏపీ శాసనసభ ఆర్థిక వ్యవహారాల అంచనా కమిటీ చైర్‌పర్సన్
కుటుంబ రాజకీయ నేపథ్యం : తాత విశ్వాసరాయి అప్పన్నదొర, 1951 నుంచి 56 వరకు పర్లాకిమిడి అసెంబ్లీకి ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహించారు. తండ్రి విశ్వాసరాయి నర్సింహదొర (వండువదొర) పార్వతీపురం ఎస్టీ నియోజకవర్గం నుంచి 1962–1967 వరకు ఎంపీగా, 1972–77, 1978–83 మధ్య కాలంలో కొత్తూరు ఎస్టీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహించారు. 1985 నుంచి 89 వరకు కాంగ్రెస్(ఐ) తరపున ఎమ్మెల్యేగా చురుకైన రాజకీయాలు చేశారు. పీసీసీ జనరల్ సెక్రటరీ, ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్, ఏపీ ట్రైబల్ కార్పొరేషన్ చెర్‌పర్సన్, తదితర నామినేటెడ్ పదవులు చేపట్టారు. మేనమామ (భర్త తండ్రి) మండంగి కామయ్య ఒడిశా రాష్ట్రం రాయగడ అసెంబ్లీ నియోజకవర్గానికి 1951–55, 1955–60, 1960–65 సంవత్సరాల మధ్య ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా వరుసగా మూడుసార్లు ఎన్నికయ్యారు. రాయగడ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు చేపట్టారు. 1966 నుంచి జైపూర్ సుగర్ ఫ్యాక్టరీ లిమిటెడ్ అధ్యక్షుడిగా, రైతు సంఘాల నాయకుడిగా సేవలు అందించారు.

రాజకీయ రంగప్రవేశం..

పాలకొండ (ఎస్టీ రిజర్వుడు) అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2009లో ప్రజారాజ్యం పార్టీ తరఫున పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన విశ్వాసరాయి కళావతి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. అప్పట్లో ఈమెకు 22 వేల పైచిలుకు ఓట్లు వచ్చాయి. అనంతరం 2014లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి తన ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి నిమ్మక జయకృష్ణపై 1652 ఓట్ల మెజార్టీతో గెలిచి తొలిసారి ఎమ్మెల్యేగా ఈ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించారు. 2019లో మరోసారి వైఎస్సార్‌సీపీ తరపున ఈ నియోజకవర్గ ప్రజలు ఆమెకు 18 వేల పైచిలుకు మెజార్టీతో పట్టం కట్టారు.

మాట ఇస్తే నెరవేర్చుతారు..



పాముల పుష్పశ్రీవాణి (కురుపాం ఎమ్మెల్యే)

కురుపాం నియోజకవర్గం (ఎస్టీ రిజర్వుడు)
పేరు: పాముల పుష్పశ్రీవాణి
కులం: ఎస్టీ
ప్రస్తుత హోదా: ఎమ్మెల్యే
విద్యార్హత: బీఎస్సీ, బీఈడీ

కురుపాం: మాట ఇస్తే నెరవేర్చుతారు. ఆదప వేళ అండగా ఉంటారు. గిరిజన ప్రజల సంక్షేమానికి అవిశ్రాంతంగా కృషిచేస్తున్నారు. గిరిజన గూడలకు 'మార్గం' సుగమం చేశారు. గిరిజన ప్రాంతంలో విద్యాభివృద్ధికి తనవంతు పాటుపడుతున్నారు. కురుపాం నియోజకవర్గ అభివృద్ధికి ఆమె ముందు చూపు, జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి పాలన ఆమెకు కురుపాం ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

తల్లిదండ్రులు: పాముల నారాయణమూర్తి, పాముల గౌరీపార్వతి
వివాహం: మార్చి 14, 2014 (జియ్యమ్మవలస మండలం చిన్నమేరంగికు చెందిన మాజీ ఎమ్మెల్యే శత్రుచర్ల చంద్రశేఖరరాజు కుమారుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు (ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు)తో వివాహం అయ్యింది.
కుమార్తె పేరు: యశ్విత శ్రీ జగతి
రాజకీయ నేపథ్యం: 2014, 2019లో ఎమ్మెల్యే అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ తరపున కురుపాం నియోజకవర్గంలో పోటీచేసి గెలిపొందారు. రాష్ట్ర ఉప ముఖ్య మంత్రిగా, గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు.
చేపట్టిన సామాజిక , అభివృద్ధి కార్యక్రమాలు:
రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో కురుపాం నియోజకవర్గంలో ఎవరికి కష్టం వచ్చినా వెంటనే స్పందించేలా జగతీ అంబులెన్స్ సర్వీసును ఏర్పాటు చేశారు. ఆపదవేళ తోడుగా ఉంటున్నారు. దశాబ్దాలుగా గిరిజనులను పట్టి పీడిస్తున్న రోడ్ల సమస్యకు చెక్ పెట్టారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. కురుపాం నియోజకవర్గంలో రూ.190కోట్ల వ్యయంతో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు తనవంతు కృషిచేశారు.

'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం'



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొండకూనేరు గ్రామంలో వైఎస్సార్ సీపీ మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. బూత్ కన్వీనర్ జీలకర్ర సోములు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులంతా ఇంటింటికీ వెళ్లి, ఈ ఐదేళ్లలో ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపించి, మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.